జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 27 | మే | 2026 ◆ పేజీలు : 7



# రాత్రింబవళ్లు మొక్కజొన్న అన్‌లోడింగ్‌కు ఆదేశాలు

- ఇందిరా మహిళా శక్తి భవన పనులపై కలెక్టర్ ఆగ్రహం
- జాప్యానికి కారణమైన కాంట్రాక్టర్లకు మెమోలు జారీ చేయాలని సూచన

**కొత్తగూడెం, మే 26 (ప్రజాజ్యోతి)** లక్ష్మీదేవిపల్లి మండలంలోని బంగారు చిలక మొక్కజొన్న నిల్వ గోడౌన్‌తో పాటు ఇల్లందు క్రాస్ రోడ్ వద్ద నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం పరిశీలించారు. మొక్కజొన్న అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయడంతో పాటు మహిళా శక్తి భవన నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. బంగారు చిలక మొక్కజొన్న గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్.. గోడౌన్‌కు చేరుతున్న లారీల అనల◌ోడింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే రాత్రి వేళల్లో కూడా అన్‌లోడింగ్ పనులు కొనసాగించాలని సూచించారు. ఇందుకోసం తగిన లైటింగ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు అదనపు హమాలీలను నియమించాలని అధికారులను ఆదేశించారు. గోడౌన్‌లో 2,500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సుజాతనగర్, కొత్తగూడెం, టేకులపల్లి, ఇల్లందు, చర్ల, సమ్మెట, బూర్గంపాడు, ఆళ్లపల్లి, గుండాల తదితర మండలాల నుంచి మొక్కజొన్న ఇక్కడికి చేరుతోందని తెలిపారు. మొక్కజొన్న బస్తాల

మిగతా 2 లో...





# గిరిజనులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుంది

- అభివృద్ధి, సంక్షేమాన్ని గిరిజన కుటుంబాలకు అందించాల్సిన బాధ్యత అధికారులదే
- ప్రతి గిరిజనరైతు ఆయిల్ ఫామ్ సాగును చేపట్టండి, అంతర పంటలతో అదనపు లాభాలు.... ఎమ్మెల్యే జారే
- మారుమూల గిరిజన గ్రామం మొద్దులమడలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే జారే
- గిరిజన యువతీ యువకులకు నైపుణ్యాల శిక్షణ
- జీవనోపాధిని పెంపొందించుకోవాలి.... బి రాహుల్ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి

**అశ్వారావుపేట, మే 26,ప్రజాజ్యోతి :** గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ఆదివాసి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులు పై ఉందని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన మొద్దులమడలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే పాల్గొని గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే జారే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ

మిగతా 2 లో...

# సింగరేణిని ప్రైవేటీకరణ చేయనివ్వం...

- సుదీర్ఘ చరిత్ర కలిగిన బొగ్గు వైభవాన్ని కాపాడాలి
- పూసపల్లి నూతన ఓసి నిర్మాణానికి అడుగులు పడింది బిఆర్ఎస్ హయాంలోనే: మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్

2 లో...





# కాంకేర్‌లో మావోయిస్టుల డంప్ స్వాధీనం

- టిఫిన్ ఐఈడీలు, డిటోనేటర్లు, రైఫిల్ రౌండ్లు స్వాధీనం


**చర్ల , మే 26:(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో భద్రతా దళాలు మరోసారి భారీ విజయాన్ని సాధించాయి. రెండు వేర్వేరు ఆపరేషన్లలో టిఫిన్ ఐఈడీలు,

మిగతా 2 లో...

# రూ. 20వేలు ఇస్తామని హామీ ఇచ్చింది మీరే

- గ్రామ దీపికలకు పనిభారం పెరుగుతోంది, వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి
- ప్రజాప్రభుత్వంలో మహిళలు కన్నీరు పెట్టుకుంటుంటే కనిపించట్లేదా..?
- ఇచ్చిన హామీ అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతాం..మెచ్చా నాగేశ్వరావు.. మాజీ ఎమ్మెల్యే

2 లో...



## కాంకేర్‌లో మావోయిస్టుల డంప్ స్వాధీనం



(మొదటి పేజీ తరువాయి...)

ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, భారీ పరిమాణంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. కోయిలిబేడ, పార్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా పోలీసులు, డీఆర్‌జీ, బీఎస్ఎఫ్, బీడీఎస్ సంయుక్త బృందాలు ఈ ఆపరేషన్లు నిర్వహించాయి.భద్రతా దళాలు కాంకేర్–నారాయణ్‌పూర్ సరిహద్దు ప్రాంతంలోని గుమ్‌చూర్ గ్రామ అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ సందర్భంగా భూగర్భంలో దాచిపెట్టిన నక్సలైట్ల నిల్వను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్కడి నుంచి నక్సలైట్ సాహిత్యంతో పాటు 42,303 రైఫిల్ రౌండ్లు, 75 ఎస్ఎల్ఆర్ రౌండ్లు, 21 రైఫిల్ రౌండ్లు, రెండు ఎస్ఎల్ఆర్ మ్యాగజైన్ ఫిల్లర్లు, ఆరు ఎలక్ట్రిక్ డిటోనేటర్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. పడల్‌మాస్పి గ్రామ అటవీ,కొండ ప్రాంతాల్లో మరోసారి గాలింపు చేపట్టగా నక్సలైట్ల డంప్‌ను గుర్తించారు. అక్కడి నుంచి ఒక నాటు తుపాకీ, రెండు కిలోల టిఫిన్ ఐఈడీ, పవర్ కంట్రోలర్, వైర్లు, బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు.కాంకేర్, నారాయణ్‌పూర్ నక్సల్ ప్రభావిత సరిహద్దు ప్రాంతాల్లో భద్రతా దళాల సంయుక్త ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఇటీవల కూడా నక్సలైట్ యూనిఫారాలతో పాటు భారీ పరిమాణంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

## రూ. 20వేలు ఇస్తామని హామీ ఇచ్చింది మీరే



**అశ్వారావుపేట, మే 26, ప్రజాజ్యోతి:** గ్రామ దీపికలపై రోజురోజుకు పని భారం పెరుగుతోందని, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అశ్వారావుపేట మాజీ శాసనసభ్యులు మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రంలోని వివేకానంద కూడలిలో పాత ఎంపీడీవో కార్యాలయం వద్ద గత నాలుగు రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న గ్రామ దీపికలను సోమవారం స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండుటెండలో గ్రామ దీపికలు నిరసన వ్యక్తం చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు ఏసీ గదులలో కూర్చొని తమాషా చూస్తున్నారన్నారు. ప్రజా ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి కన్నీళ్లు పెట్టుకుంటున్న మహిళలు కనిపించట్లేదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ దీపికలకు రూ.20 వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరైంది కాదన్నారు. గ్రామ స్థాయిలో వివిధ ప్రభుత్వ పథకాల అమలులో గ్రామ దీపికలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి తగిన గుర్తింపు, వేతన భద్రత కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే గ్రామ దీపికల సమస్యలపై స్పందించి, ఎన్నికల హామీ ప్రకారం రూ.20 వేల వేతనం అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. గ్రామ దీపికల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు కాసాని నాగ శేష పద్మ గ్రామ దీపికలకు కొబ్బరినీళ్లు, భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సున్నం నాగమణి, జూపల్లి రమణారావు, జిల్లా అధికార ప్రతినిధి యుఎస్ ప్రకాష్ రావు, కౌన్సిలర్ భూక్య ఉదయజ్యోతి,సత్యవరపు సంపూర్ణ,నారం రాజశేఖర్, జుజ్జురపు శ్రీరామమూర్తి, జక్కుల రాంబాబు, చందా కుమారస్వామి, జోష్న, గోవింద్, జీవన్ రావు,చిప్పనపల్లి శ్రీను, ఏలేటి పార్వతి, ఇస్లావత్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రాత్రింబవళ్లు మొక్కజొన్న అన్‌లోడింగ్‌కు ఆదేశాలు





(మొదటి పేజీ తరువాయి...)

నిల్వ విధానాన్ని పరిశీలించిన కలెక్టర్.. పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యాన్ని వినియోగించుకునేలా బస్తాలను ఎత్తుగా పేర్చాలని సూచించారు. పంటకు ఎలాంటి నష్టం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హమాలీలతో మాట్లాడిన కలెక్టర్.. ఒక్క లారీ అనలోడింగకు ఎంత సమయం పడుతోందో ఎదురవుతున్న ఇబ్బందులు ఏమిటో తెలుసుకున్నారు. హమాలీలకు తాగునీరు సహా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఇల్లందు క్రాస్ రోడ్ వద్ద నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవన పనులను పరిశీలించిన కలెక్టర్.. పనుల పురోగతిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాది మే నెలలో ప్రారంభమైన పనులు ఇంకా పూర్తి కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆలస్యానికి గల కారణాలను నివేదించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం చేసిన కాంట్రాక్టర్లకు మెమోలు జారీ చేయాలని సూచించారు. రూ.5 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత లక్ష్యంగా నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవనాల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. భవన నిర్మాణ ప్లాన్లు, గదుల నిర్మాణం, మౌలిక సదుపాయాల పనులను పరిశీలించిన కలెక్టర్.. ప్రతిరోజూ పనుల పురోగతిని పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. అవసరమైన సంఖ్యలో కార్మికులను నియమించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తుల ప్రదర్శన, మార్కెటింగ్ కార్యకలాపాలకు ఉపయోగపడేలా భవనాన్ని అన్ని సౌకర్యాలతో సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శిరీష, పంచాయతీరాజ్ అధికారి శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గిరిజనులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుంది





(మొదటి పేజీ తరువాయి...)

విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.గ్రామంలో 176 కుటుంబాలు నివసిస్తున్నాయని ప్రస్తుతం 75 ఇందిరమ్మ ఇల్లకు అనుమతి వచ్చిందని,32 పూర్తయ్యాయని మిగిలిన వాటిని కూడా తెలిసిన వారీగా నిర్మాణాలు చేపడతామన్నారు. అలాగే 360 ఎకరాల సాగుభూములో కొందరికి పోడు పట్టాలు అందలేదని వాటిని అందించేందుకు కృషి చేస్తానన్నారు. అంగన్వాడి సెంటర్ ద్వారా గర్భిణీలకు చిన్నారులకు పోషక ఆహారం అందేలా చూస్తామని, ప్రభుత్వ అందించే సంక్షేమాన్ని గిరి పుత్రులు అందుపుచ్చుకోవాలన్నారు. రానున్న వర్షాకాలం నాటికి పంటలు వేసేందుకు గిరిజనులు సిద్ధం కావాలన్నారు. గిరిజన రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై ఎమ్మెల్యే అవగాహన కల్పించారు. ప్రతి గిరిజన రైతు ఆయిల్ ఫామ్ సాగును చేపట్టి ఆర్థికంగా ఎదగాలని, ఆయిల్ ఫామ్ తోటల మధ్య అంతర పంటలు సాగు చేస్తే అదనపు ఆదాయం పొందవచ్చని, ప్రభుత్వం రైతులకు అవసరమైన సహాయం అందిస్తోందన్నారు.

### గిరిజన యువతీ యువకులకు నైపుణ్యాల శిక్షణ

**››› జీవనోపాధిని పెంపొందించుకోవాలి.... బి రాహుల్ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి**

గిరిజన ప్రాంతాల యువతీ యువకులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా వివిధ రంగాల్లో నైపుణ్యాల శిక్షణ అందించనున్నామని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్ తెలిపారు. స్థానిక శాసనసభ్యులు జారే సహకారంతో ఐటీడీఏ నిధులతో గ్రామస్తుల కోరిక మేరకు కంటైనర్ మొబైల్ దవాఖానాలను జూన్ 30 ఏర్పాటు చేస్తామన్నారు. ఈ గ్రామంలో కల్వర్టుల నిర్మాణానికి, 76 సర్వే నెంబర్ చెరువుకు సంబంధించిన భూములకు రెండు నెలల్లో శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బాల్య వివాహాలు జరగకుండా గిరిజన యువత చూడాలని ఎవరైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే 1098 నెంబర్ కి ఫోన్ చేయాలని సూచించారు. గిరిజన యువతీ, యువకులు నైపుణ్యాల శిక్షణ తీసుకునేందుకు అశ్వారావుపేటలోని గిరిజన భవన్ లో 100 రోజుల ప్రణాళికతో జీవనోపాధిని పెంపొందించుకునేలా వివిధ రకాల శిక్షణలు స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ శిక్షణ, బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ, టైలరింగ్, చేపల పెంపకం, తేనెటీగల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం వంటి శిక్షణను ఉచిత భోజన వసతి సౌకర్యాలు కల్పిస్తూ అందిస్తామన్నారు. శిక్షణ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించుకుని ఆర్థికంగా ఎదగాలని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకుని జీవనోపాధిని మెరుగుపరుచుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. తిరుమల కుంట గ్రామానికి చెందిన చరణ్ జేఎన్టీయూలో విద్యానభ్యసిస్తున్నందున అతనికి లాప్టాప్, జాతీయ అభియాన్ ఫెస్టివల్ న్యూఢిల్లీకి వెళ్లిన శివకుమార్ రెడ్డికి 10వేల రూపాయలు చెక్కును ఎమ్మెల్యే జారేతో కలిసి అందించారు. గిరిజనులకు చెందిన 45 ఎకరాల పోడు పట్టా భూములకు సంబంధించి రూ.23 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్, బోర్ వెల్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అశోక్, ఎడిఎం హెచ్ఓ సైదులు, పివిటిజే అధికారి గన్యా, హెచ్ఎంటిసి ఉదయ్ కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ మధుకర్, ఎస్టిసి ఆనంద్ కుమార్, ఎమ్మార్వో కిషోర్, ఎంపీడీవో రామకోటారెడ్డి, అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, స్థానిక సర్పంచ్ పందు రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగరేణిని ప్రైవేటీకరణ చేయనివ్వం

**ఇల్లందు, మే 26, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ చేయనివ్వమని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాదు తెలంగాణ భవన్‌లో టిబిజీకెఎస్ గౌరవాధ్యక్షుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, టిబిజీకెఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన టీబీజీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ మాట్లాడుతూ సుదీర్ఘ చరిత్ర కలిగిన బొగ్గు వైభవాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందు మనుగడ కోసం పూసపల్లి ఓసి ప్రారంభానికి అడుగులు పడింది బిఆర్ఎస్ హయంలోనేనని గుర్తు చేశారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు బొగ్గుకు నిలయమైన బొగ్గుకు పుట్టినిల్లు అయిన ఇల్లందు చరిత్ర ఓసి మూతివేతతో ఖాళీ అవుతుందని అనగానే ఇల్లందు చరిత్రను కాపాడుకోవడం కోసం ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తో మాట్లాడి పూసపల్లి ఓసిని నూతన ఓసిగా ఏర్పాటు చేసే విధంగా పెద్ద ఎత్తున ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని, అందులో భాగంగానే పబ్లిక్ హియరింగ్, ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్ అన్ని జరిగినప్పటికీ నేటికీ పూసపల్లి ఓసి ప్రారంభోత్సవం అనేది నత్తనడకన ఎందుకు నడుస్తుందని ప్రశ్నించారు. దేశానికి వెలుగులు అందించే ఈ సింగరేణి సంస్థకు వందల ఏళ్ల సుదీర్ఘమైన చరిత్ర ఉందని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గ నిర్దేశంతో రాబోయే ఎన్నికలలో ఎవరైతే కేసీఆర్ ద్వారా కారుణ్య నియామకాల కింద నియమింపబడ్డ యువ కార్మికుల సంపూర్ణ సహకారంతో వారి చురుకైన పాత్రతో కేసీఆర్ ను మూడవసారి ముఖ్యమంత్రిని చేసే విధంగా అందరం అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్సీలు, టిబిజీకెఎస్ నాయకులు పాల్గొన్నారు.



# 5.03 ఎకరాల భూమిని కొనుగోలు చేశాను

- నన్ను ఇబ్బంది పెట్టవద్దు
- కోర్టు కేసులో ఉండగానే పట్టా చేశారు
- జిల్లా, స్థానిక అధికారులు న్యాయం చేయండి





**ఇల్లందు, మే 26, ప్రజాజ్యోతి:** సుదిమళ్ల పంచాయతీ పరిధిలోని 339 సర్వే నంబర్‌లో గల 5.03 ఎకరాల భూమిని తాను కొనుగోలు చేశానని జక్కుల పూలమ్మ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భూమికి సంబంధించిన వ్యవహారం కోర్టు పరిధిలో ఉండగా ఎలాంటి తీర్పు రాకుండానే ఏకపక్షంగా పట్టా చేసి తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.2000 సంవత్సరం నుండి 339 సర్వే నంబర్‌లో గల 5.03 ఎకరాల భూమిని కౌలుకు చేయడం జరిగిందని తెలిపారు. 2015 సంవత్సరంలో అదే భూమిని అమ్ముతుండగా ఎకరం రూ.4.60 లక్షల చొప్పున మొత్తం రూ.23,34,500లకు కొనుగోలు చేశానని, అందులో రూ.8 లక్షలు బాకీ ఉండటంతో వడ్డీతో సహా 2016లో చెల్లించి బాండ్ పేపర్ రాయించుకున్నట్లు వివరించారు.అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో తనకు భూమి అమ్మిన వారు భద్రాచలం మొబైల్ కోర్టులో కేసు వేసి ఆర్డర్ తెచ్చుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో తాను న్యాయవాది ద్వారా హైకోర్టులో కేసు వేసి భద్రాచలం మొబైల్ కోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను రద్దు చేయించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మొదట తనపై కేసు వేసిన వారు మృతిచెందడంతో, వారి కుటుంబ సభ్యులు మళ్లీ భద్రాచలం మొబైల్ కోర్టులో వేరొకరి పేరు పై కేసు వేశారని వివరించారు.మళ్లీ తాను న్యాయవాది ద్వారా తనకు భూమి అమ్మిన వారి కుటుంబ సభ్యులు భద్రాచలం మొబైల్ కోర్టులో కేసు వేసిన వ్యక్తి ఎవరో తెలియజేయాలని కౌంటర్ వేశామని తెలిపారు. తనకు భూమి అమ్మిన వారి కుటుంబ సభ్యులు హైకోర్టుకు వెళ్లడం జరిగిందని, హైకోర్టులో అసలు ఆ భూమిపై ఎవరు ఉన్నారనే అంశంపై పూర్తి పరిశీలన చేసి, స్థానికంగా ఇరువురి పంచనామా తీసుకొని గ్రామస్తుల సమక్షంలో గ్రామసభ నిర్వహించి నివేదికలు పంపాలని సూచించినట్లు పేర్కొన్నారు.కానీ అప్పటి తహసిల్దార్ పరిశీలన చేయకుండా, పంచనామా నిర్వహించకుండా, గ్రామసభ ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. అంతేకాకుండా తాను కొనుగోలు చేసిన బాండ్ పేపర్లు తనకు ఇవ్వలేదని, ఇల్లందు పోలీస్ స్టేషన్‌కు పిలిపించగా అప్పటి పోలీస్ అధికారి కొనుగోలు చేసిన కాగితాలు తీసుకురమ్మని చెప్పారని తెలిపారు. తాను వెళ్లి తనకు సంబంధించిన బాండ్ పేపర్లు ఇవ్వాలని అడగగా ఇచ్చారని గుర్తు చేశారు.మరి ముఖ్యంగా తాను నిర్మించిన ఇంటి స్థలం కూడా వారి వద్ద నుంచే కొనుగోలు చేశానని, తనకు సగం, బొజ్జాయిగూడెం గ్రామానికి చెందిన మూగల ఆశాలకు సగం విక్రయించారన్నారు. అనంతరం మూగల ఆశాలు అవసరాల నిమిత్తం వేరొకరికి ఆ స్థలాన్ని విక్రయించడం జరిగిందని పేర్కొన్నారు.అదేవిధంగా తనకు కోర్టు నుండి ఎలాంటి నోటీసులు రాకుండా తప్పుడు అడ్రస్ ఇచ్చారని, దీంతో తనకు కోర్టు నుండి ఎలాంటి నోటీసులు రాలేదని స్పష్టం చేశారు. 2020 నుంచి కోర్టులో కేసులు నడుస్తున్నాయని, కోర్టు తీర్పు రాకుండానే పట్టా చేయడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, స్థానిక తహసిల్దార్‌లు స్పందించి, కోర్టులో కేసులు నడుస్తున్నప్పటికీ ఎలాంటి తీర్పు రాకుండానే 2026 ఫిబ్రవరి నెలలో తహసిల్దార్ చేసిన పట్టాను రద్దు చేసి తనకు న్యాయం చేయాలని పూలమ్మ వేడుకుంటున్నారు.

## మాజీ మంత్రిని కలిసిన దిండిగాల



**ఇల్లందు, మే 26, ప్రజాజ్యోతి:** హైదరాబాద్ లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ను మంగళవారం బిఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్ వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూల బొకే అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పార్టీని పటిష్టం చేసేందుకు త్వరలో నిర్వహించనున్న డిజిటల్ సభ్యత్వంలో చురుకుగా పాల్గొనాలని, యువకులు పార్టీ కార్యక్రమాలలో అధిక శాతం పాల్గొనేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించినట్లు దిండిగాల తెలిపారు. ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు అన్ని వర్గాల ప్రజల సహకారంతో ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాలని, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో రైతాంగం వరి, మొక్కజొన్న వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకంలో ప్రభుత్వ అసమర్థ విధానాల వలన పడుతున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించి రైతులకు అండగా నిలవాలని సూచించడం దిండిగాల పేర్కొన్నారు.

## రెండు రాష్ట్రాల డాన్స్ పోటీల బ్రోచర్ ఆవిష్కరణ




**ఇల్లందు, మే 26, ప్రజాజ్యోతి:** ఇల్లందుకు చెందిన వెంకట్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి నిర్వహించనున్న డాన్స్ పోటీల బ్రోచర్‌ను మంగళవారం హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి డాన్స్ కాంపిటీషన్ లో భాగంగా తెలుగు ఫిలిం కొరియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలత, తెలంగాణ డాన్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి మాస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమలత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభకు ఇలాంటి వేదికలు ఎంతో అవసరమన్నారు. యువ కళాకారులకు అవకాశాలు కల్పిస్తున్న వెంకట్ డాన్స్ అకాడమీని అభినందించారు. అనంతరం అకాడమీ నిర్వాహకులు మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ప్రతిభావంతులైన డాన్సర్లను ప్రోత్సహించే లక్ష్యంతో పోటీలను భారీ స్థాయిలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా యూనియన్ ప్రెసిడెంట్ ప్రశాంత్ మాస్టర్, కదారి వెంకటేష్, శేఖర్, సాయి, అరుణ్, రమేష్, డాన్స్ మాస్టర్లు, కళాకారులు పాల్గొన్నారు.

## హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో గర్భాశయ క్యాన్సర్ నుంచి విముక్తి

- భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ




**భద్రాచలం టౌన్, మే 26, ప్రజాజ్యోతి** 14 సంవత్సరాలు దాటిన బాలికలు తప్పనిసరిగా హెచ్ పి వి వ్యాక్సిన్ తీసుకోవడం వలన భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ నుంచి విముక్తి పొందవచ్చునని భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ అన్నారు. మంగళవారం దుమ్ముగూడెం ప్రాజెక్ట్ పరిధిలోని భద్రాచలం సెక్టార్ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాల సందర్భంగా భద్రాచలం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సిడిపిఓ జ్యోతితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పని చేయుచున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారులకు రక్తహీనత కలగకుండా న్యూట్రిషన్ ఫుడ్ సక్రమంగా అందించాలని, గర్భిణీ స్త్రీలకు సమయానుకూలంగా బాలామృతం అందజేసి పుట్టబోయే బిడ్డ మంచి ఆరోగ్యంగా ఉండేలా గర్భిణీలు పలు జాగ్రత్తలు తీసుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. అలాగే పోషకాహార ప్రాముఖ్యత గురించి తప్పనిసరిగా గ్రామాలలో తెలియజేయాలని తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలు తీసుకునేలా చూడాలని అన్నారు. అనంతరం సిడిపిఓ జ్యోతి మాట్లాడుతూ గిరిజన గ్రామాలలో ఎక్కువ శాతం బాల్య వివాహాలు చేస్తూ ఉంటారని వాటిని నిరోధించడానికి మా ప్రాజెక్టు తరుపున ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమానికి వచ్చిన బాలికలు అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు చంద్రకళ, అనసూయ మరియు బాల బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ఇంటితో కొత్త ఆశలకు శ్రీకారం

- ఇందిరమ్మ ఇంటితో రాచకొండ కుటుంబంలో ఆనందం
- అన్నపురెడ్డిపల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పర్సా వెంకట్ పాల్గొన్నారు



**అన్నపురెడ్డిపల్లి, మే 26, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల మర్రిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని బుచ్చన్నగూడెం గ్రామంలో రాచకొండ రాంబాబు – సైదమ్మ దంపతుల కొత్త ఇంటి గృహప్రవేశ వేడుక ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థుల సమక్షంలో నిర్వహించిన ఈ శుభకార్యం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమానికి అన్నపురెడ్డిపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పర్సా వెంకట్ ముఖ్య అతిథిగా హాజరై దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటిలో కుటుంబం సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ వారి ఆనందంలో భాగస్వాములయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇంటి కలలు నెరవేరుతున్నాయని కార్యక్రమంలో పలువురు పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఇలాంటి గృహ పథకాలు ఎంతో ఉపయోగకరంగా మారుతున్నాయని అభిప్రాయపడ్డారు. సొంత ఇల్లు ప్రతి కుటుంబానికి భద్రతతో పాటు ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం వల్ల కుటుంబాల్లో ఆనందం పెరుగుతోందన్నారు. ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ పథకాలు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొండ్రు సృజన, వైస్ సర్పంచ్ గాలం కాటం రాజు, మండల నాయకుడు వీరబోయిన నాగేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు కాలం రాంబాబు పాల్గొన్నారు. అలాగే పలువురు నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే అభిమానులు హాజరై వేడుకను మరింత ఉత్సాహంగా మార్చారు. రాచకొండ దంపతుల కొత్త ఇంటి గృహప్రవేశం గ్రామంలో ఆనంద వాతావరణాన్ని తీసుకురాగా, కుటుంబానికి ఇది కొత్త ఆశలు, కొత్త ఆనందాలకు నాంది కావాలని హాజరైన వారు ఆకాంక్షించారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వం స్వీకరించిన గాదె మాదవరెడ్డి



**భద్రాచలం టౌన్, మే 26, ప్రజాజ్యోతి** భద్రాచలంకు చెందిన ప్రముఖ సంఘ సేవకులు గాదె మాధవరెడ్డి మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వంను ప్రముఖ వైద్యులు, మారుతి నర్సింగ్ కాలేజ్ కరస్పాండెంట్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎల్.కాంతారావు నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.ఎల్. కాంతారావు మాట్లాడుతూ రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేయడంలో గాదె మాదవరెడ్డి సేవలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సభ్యత్వాన్ని ఆహ్వానించి అందజేసిన డాక్టర్ ఎస్.ఎల్. కాంతారావుకి గాదె మాధవరెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా సమాజ సేవా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ మోర్తాల సిద్దారెడ్డి, సామాజిక సేవకులు, రెడ్ క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను చల్లబర్చుతున్న విద్యుత్తు సిబ్బంది



**భద్రాచలం టౌన్ , మే 26 ప్రజా జ్యోతి** భద్రాచలంలోని 48 డిగ్రీల ఉష్ణోగ్రతతో వేడెక్కుతుండటంతో విద్యుత్తు అంతరాయం లేకుండా విద్యుత్తు శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఎర్త్ పైపులకు మధ్యాహ్నం సమయంలో నీళ్లు పడుతున్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మన్ల పర్యవేక్షించేందుకు జోన్ వైజ్‌గా అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమాలను లైన్ ఇన్స్‌పెక్టర్ శ్రీను, లైన్‌మెన్ త్రినాధరెడ్డి, అసిస్టెంట్ లైన్‌మెన్ జగదీష్ పర్యవేక్షిస్తున్నారు.

## ఆసరా పెన్షన్లను ఐదు లక్షలకు పెంచాలి

**భద్రాచలం టౌన్, మే 26, ప్రజాజ్యోతి** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో కొత్తగా అందజేయనున్న ఆసరా పెన్షన్ల సంఖ్యను రెండు లక్షల నుంచి ఐదు లక్షలకు పెంచాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి శేఖర్ అన్నారు. భద్రాచలంలో మంగళవారం జరిగిన మాలమహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసరా పెన్షన్లకు ఆదాయ ధృవీకరణ ప్రామాణికం కాబట్టి లబ్ధిదారులకు ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరిగినా కార్యాలయాల్లో సిబ్బంది ఎవరు సరిగా అందుబాటులో ఉండటం లేదని, జనాభ లెక్కల కార్యక్రమంలో బిజీగా ఉండటం వలన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెన్షన్ల పెంపు గడువును జూలై 2కు పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవరాజ్, రమేష్, శ్రీను, కుమార్, పాపయ్య పాల్గొన్నారు.

## వేం నరేందర్ రెడ్డితో భద్రాచలం కాంగ్రెస్ నాయకుల భేటీ



**భద్రాచలం టౌన్, మే 26, ప్రజాజ్యోతి** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డిని భద్రాచలంకు చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసారు. భద్రాచలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు భోగాల శ్రీనివాస్ రెడ్డితో పాటు మరికొందరు ముఖ్య నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వేం నరేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాకు సంబంధించిన పలు రాజకీయ, స్థానిక అభివృద్ధి అంశాలు ఈ భేటీలో చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది.

# బాల్య వివాహాలు సమాజానికి శాపం

- బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం
- బాల్య వివాహాలు బాలికల భవిష్యత్తును నాశనం చేస్తాయి
- ఐసీడీఎస్ సీడీపీఓ జయలక్ష్మి



**మణుగూరు, మే 26 (ప్రజాజ్యోతి):** గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టాలని లేదంటే బాల్య వివాహాలు సమాజానికి శాపంలా మారుతాయని ఐసీడీఎస్ సీడీపీఓ జయలక్ష్మి అన్నారు. 99 రోజుల ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుండి మే 30 వరకు అవగాహనా కార్యక్రమాన్ని అధికారుల పిలుపు మేరకు మహిళా వారోత్సవాలను మంగళవారం గుట్ట మల్లారం అంగన్‌వాడీ కేంద్రంలో "బాల్య వివాహాలు – బతుకు ఆగం" అనే అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి జయలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల భవిష్యత్తును నాశనం చేస్తాయని, ప్రతీ ఒక్కరు వాటిని అరికట్టేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో ప్రజలందరూ కలిసి బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలని అన్నారు. బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. బాలికల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని, బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కంకణ బద్ధులై ఉండాలన్నారు. అనంతరం సూపర్వైజర్లు హైమావతి, పద్మ, భద్రమ్మ, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, యశోద, వెంకటరమణ పాల్గొని బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా బాల్య వివాహాల నిర్మూలనపై గ్రామస్థుల్లో చైతన్యం పెంపొందించేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొమరం మధుకిరణ్, గ్రామస్తులు, తల్లులు, బాలికలు పాల్గొన్నారు.

## ఎండల ముప్పు.. అప్రమత్తమే రక్షణ

- వడదెబ్బ నివారణకు ముందస్తు జాగ్రత్తలే మేలు
- ఎండల తీవ్రత నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : పర్స వెంకట్



**అన్నపురెడ్డిపల్లి, మే 26, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలం వ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పర్స వెంకట్ సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వడదెబ్బ, అలసట, నీరసం వంటి సమస్యలు రాకుండా తరచూ తగినంత నీరు తాగాలని సూచించారు. మజ్జిగ, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవడం ద్వారా శరీరంలో నీటి శాతం నిలుపుకోవచ్చన్నారు. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, తేలికపాటి దుస్తులు ఉపయోగించాలని కోరారు. చిన్నపిల్లలు, వృద్ధులు మరియు అనారోగ్యంతో బాధపడేవారు మరింత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. రైతులు, కూలీలు మరియు బయట పనులు చేసే వారు ఉదయం లేదా సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవడం మంచిదన్నారు. ఎండ తీవ్రత సమయంలో వాహనాల్లో లేదా మూసివేసిన ప్రదేశాల్లో చిన్నపిల్లలను ఒంటరిగా వదిలిపెట్టకూడదని హెచ్చరించారు. ఇంటి వద్ద కూడా తగినంత గాలి, నీటి సౌకర్యం ఉండేలా చూసుకోవాలని సూచించారు. అధిక చెమటలు, తల తిరగడం, నీరసం లేదా వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. మండల ప్రజల ఆరోగ్యం అందరికీ ముఖ్యమని, ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉండి ఎండల ప్రభావం నుంచి రక్షణ పొందాలని పర్స వెంకట్ కోరారు.

## జనజాతి సమాగమం విజయవంతం





**చర్ల, మే 26 (ప్రజా జ్యోతి) :** జన జాతి సాంస్కృతిక సమాగమం కోసం నిర్వహించిన "చలో ఢిల్లీ" కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు, వనవాసి బంధువులకు వనవాసి కళ్యాణ పరిషత్ భద్రాద్రి జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామగ్రామం నుండి స్వచ్ఛందంగా తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొన్న వనవాసుల ఉత్సాహం, ఐక్యత, సేవాభావం అభినందనీయమని పేర్కొన్నారు. స్వతంత్ర భారత దేశ 75 ఏళ్ల చరిత్రలో ఇంతటి విశిష్టమైన కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం ప్రతి వనవాసి కుటుంబానికి గర్వకారణమని అన్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వనవాసి సమాజ ప్రతినిధులు, కార్యకర్తలు, యువత పాల్గొనడం ద్వారా వనవాసుల ఐక్యత మరింత బలపడిందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు వక్తలు వనవాసుల సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులు, అభివృద్ధిపై చేసిన ప్రసంగాలు ఎంతో ప్రేరణాత్మకంగా నిలిచాయని అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రసంగం, వనవాసుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్న హామీ ఆశాజనకమని పేర్కొన్నారు. వనవాసుల జీవన విధానం, సంస్కృతి పరిరక్షణతో పాటు విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక అభివృద్ధి దిశగా మరిన్ని చర్యలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో చర్చించిన అంశాలను గ్రామస్థాయికి తీసుకెళ్లి ప్రతి వనవాసి కుటుంబంలో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తూ యువతను సంఘటితం చేసి, సమాజాభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా అనేక మంది కొత్త కార్యకర్తలు సంస్థ పనితీరుపై ఆసక్తి చూపించడం ఆనందదాయకమని, వారిని భవిష్యత్తులో సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే పాత కార్యకర్తల అనుభవం, మార్గదర్శకత్వం సంస్థకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమాజ సేవ, వనవాసుల సంక్షేమం కోసం పనిచేసే ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. మంచి లక్ష్య సాధన కోసం కొంత త్యాగం, క్రమశిక్షణ, సేవాభావం అవసరమని తెలిపారు. ఈ మహత్తర కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, హితైషులు, ప్రాంతీయ జిల్లా పదాధికారులు, క్షేత్ర ఆబావిక ఆశ్రమ అధికారులకు కోరం సూర్యనారాయణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా వనవాసుల అభ్యున్నతి కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృత స్థాయిలో నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

## కామ్రేడ్ గిడ్ల శ్యామ్ మృతి కార్మిక ఉద్యమానికి తీరని లోటు

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి. మధు నివాళి



**కొత్తగూడెం, మే 26 ( ప్రజాజ్యోతి )** సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం కొత్తగూడెం బ్రాంచ్ అధ్యక్షుడు, కన్వయన్స్ డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన కామ్రేడ్ గిడ్ల శ్యామ్ అకాల మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి. మధు అన్నారు. శ్యామ్ మృతి వార్త తెలుసుకున్న సీఐటీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు ఆయన నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆసుపత్రి వద్ద భౌతిక కాయానికి సీఐటీయూ జెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. 2020 నుంచి సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘంలో పనిచేస్తూ, కన్వయన్స్ డ్రైవర్ల హక్కుల కోసం శ్యామ్ అహర్నిశలు కృషి చేశారని బి. మధు పేర్కొన్నారు. హెల్త్ కార్డులు, జీతాల పెంపు వంటి సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించిన నాయకుడిగా ఆయన గుర్తుండిపోతారని అన్నారు. తక్కువ వయసులోనే అనారోగ్యంతో శ్యామ్ కన్నుమూయడం బాధాకరమని ఆయన ఆశయాల సాధన కోసం కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మంద నరసింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్, భూక్య రమేష్, లిక్కి బాలరాజు, రాజారావు, విజయగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్‌నగర్‌లో మూడు కొత్త బోర్ల ప్రారంభం

- **తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం : మేయర్ మూడ్ గణేష్**



**కొత్తగూడెం, మే 26 ( ప్రజాజ్యోతి )** కొత్తగూడెం పట్టణంలోని 12వ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేసిన మూడు కొత్త బోర్లను మంగళవారం కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం తమ బాధ్యత అని తెలిపారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు సహకారంతో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రత్యేకంగా 12వ డివిజన్‌లో నీటి సమస్యలు మళ్లీ రాకుండా ఒకేసారి మూడు బోర్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాసేవే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ టౌన్ కార్యదర్శి కంచర్ల జమలయ్య, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, భవాని ప్రసాద్, సాంబిరెడ్డి, 12వ డివిజన్ కార్పొరేటర్ నాగలక్ష్మి, 53వ డివిజన్ కార్పొరేటర్ బండి నరసింహా రావు, 49వ డివిజన్ కార్పొరేటర్ విజయ్ కుమార్, భగత్‌సింగ్ నగర్ ప్రజలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ఆదివాసి హక్కుల పరిరక్షణకు జీఎస్ పీ డిమాండ్

- **ఏజెన్సీ చట్టాలను విస్మరిస్తున్న అధికారులు**
- **పాయం సత్యనారాయణ**



**చర్ల, మే 26: (ప్రజా జ్యోతి ):** ఏజెన్సీ చట్టాలపై తెలిసీ తెలియనట్లు వ్యవహరిస్తూ అక్రమార్కులకు చర్ల తాసిల్దార్ మద్దతు ఇస్తున్నారని గోండ్వానా సంక్షేమ పరిషత్ (జీఎస్ పీ) రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ ఆరోపించారు. మంగళవారం చర్ల తాసిల్దార్ కార్యాలయంలో ఆదివాసీ నాయకులతో కలిసి తాసిల్దార్ ను కలిసిన ఆయన, గతంలో సమర్పించిన ఫిర్యాదులపై వివరణ కోరగా సరైన సమాధానం ఇవ్వకుండా పొంతనలేని వ్యాఖ్యలు చేశారని విమర్శించారు.ఏజెన్సీ ప్రాంతానికి వర్తించే ప్రత్యేక చట్టాలను పక్కనబెట్టి, మైదాన ప్రాంత పరిపాలనా విధానాలను అమలు చేస్తూ ఆదివాసుల హక్కులను నిర్వీర్యం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా చర్ల మండలంలో ఆదివాసి విద్యార్థులకు కుల ధృవీకరణ పత్రాల జారీ విషయంలో రెవెన్యూ సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.మైదాన ప్రాంతానికి చెందిన లంబాడా గూగులోత్ మంగ లింగాపురం సర్పంచ్ కు ఏ విధంగా కుల ధృవీకరణ పత్రం జారీ చేశారో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో చర్ల తాసిల్దార్ గా పనిచేసిన ఈరెల్లి నాగేశ్వరరావు అక్రమ ఇసుక, మట్టి, గ్రావెల్ దందాలను పూర్తిగా అరికట్టి అక్రమార్కుల గుండెల్లో గుబులు పుట్టించారని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఆదివాసి నాయకులు వాసు ముసలయ్య, తుడుం దెబ్బ నాయకుడు ఇర్పా ప్రకాష్, జీఎస్ పీ చర్ల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పూణేం వరప్రసాద్, శ్యామల తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ కొనసాగాలంటే నమోదు తప్పనిసరి

**చర్ల, మే 26 :(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని ఆసరా, వితంతు, వికలాంగుల పెన్షన్ లబ్ధిదారులు తప్పనిసరిగా తమ పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఫోటో నమోదు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం పెన్షన్ పొందుతున్న ప్రతి లబ్ధిదారుడు ఆధార్ కార్డు తీసుకుని గ్రామ పంచాయతీ కార్యాలయానికి హాజరై ఫోటో దిగాల్సి ఉంటుందని తెలిపారు.ఫోటో నమోదు ప్రక్రియ పూర్తి చేయని పక్షంలో భవిష్యత్తులో పెన్షన్ నిలిచిపోయే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ కార్యక్రమం గత వారం రోజులుగా కొనసాగుతున్నప్పటికీ, ఇంకా పలువురు లబ్ధిదారులకు సమాచారం చేరలేదని తెలుస్తోంది.గ్రామాల్లో పంచాయతీ అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించి ప్రతి లబ్ధిదారునికి సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పెన్షన్‌పై ఆధారపడి జీవిస్తున్న నేపథ్యంలో సమాచారం అందక నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.ఈ విషయాన్ని తెలిసిన వారు తమ పరిచయాల్లో ఉన్న పెన్షన్ లబ్ధిదారులకు తెలియజేసి, ప్రతి ఒక్కరికీ సమాచారం చేరేలా సహకరించాలని కోరుతున్నారు.

## గ్రామ దీపికల పోరాటానికి బీఆర్ఎస్ అండ

- **గ్రామ దీపికల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి**
- **కాంగ్రెస్ హామీల విస్మరణపై మెచ్చా విమర్శలు**

**దమ్మపేట,మే 26,(ప్రజాజ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట తమ సమస్యల పరిష్కారం కోసం గ్రామ దీపికలు (వి.ఏ.ఓ) చేపట్టిన నిరవధిక సమ్మెకు అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఆయన, సమ్మెలో పాల్గొంటున్న గ్రామదీపికలు లకు మజ్జిగ ప్యాకెట్లు, నిమ్మ సోడాలు పంపిణీ చేసి వారి సమస్యలను, ఆవేదనను తెలుసుకున్నారు. గ్రామదీపికల న్యాయమైన డిమాండ్ల సాధనకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మానవీయ దృక్పథంతో గ్రామదీపికల గౌరవ వేతనాలను రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు పెంచారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా మరిచిపోయిందని విమర్శించారు. గత రెండేళ్లుగా గ్రామదీపికలతో విపరీతమైన పనులు చేయించుకుంటూ, వారి సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. గ్రామదీపికల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టి గ్రామదీపికలతో కలిసి పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ రమేష్, దారా యుగంధర్, పార్కలగండి సర్పంచ్ కొమరం సుశీల, ఉప సర్పంచ్ రామకృష్ణ, అబ్దుల్ జిన్నా, యార్లగడ్డ శ్రీనివాసరావు, మండవ సత్యనారాయణ, చీకటి రామయ్య, దేవరపల్లి అజయ్ కుమార్, దారా రాము, గోళ్ళ భవానీకృష్ణ యాదవ్, రావుల శ్రీను, జలగం వాసు, వెలుగోటి మహేష్, కాసిని శ్రీను, కుకలకుంట రవి, మండల బీసీ నాయకులు తాళ్ల వెంకటేశ్వరావు, ధర్మ, సతీష్, నాగేశ్వరరావు, కోర్సా వెంకటేష్, శంకర్, కనపర్తి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.




## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- **భూసార పరిరక్షణతోనే అధిక దిగుబడులు సాధ్యం: ఎమ్మెల్యే జారే**
- **రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ**



**దమ్మపేట,మే 26,(ప్రజాజ్యోతి):** రైతు సంక్షేమం, భూసార పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారే ఆదినారాయణ స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని, పంట దిగుబడుల్లో నేల ఆరోగ్యం కీలకపాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు భూసార ఆరోగ్య పరిరక్షణ, రసాయన ఎరువుల వినియోగం తగ్గింపు లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తోందని వ్యవసాయ శాఖ వెల్లడించింది.ఈ నేపథ్యంలో అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ, సహకార శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ రైతులకు రాయితీపై పచ్చిరొట్ట ఎరువుల (గ్రీన్ మెన్యూర్) విత్తనాలను పంపిణీ చేశారు.అనంతరం పచ్చిరొట్ట పంటల సాగు ద్వారా భూసార ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమిలో సేంద్రియ కర్బనాన్ని పెంపొందించడంతో పాటు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడంలో పచ్చిరొట్ట పంటలు ఎంతో దోహదపడతాయన్నారు. రైతులందరూ భూసార పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న 50 శాతం సబ్సిడీని సద్వినియోగం చేసుకుని జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను రైతులు విస్తృతంగా సాగు చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు రైతులకు పచ్చిరొట్ట విత్తనాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించి, విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, సొసైటీ ఉపాధ్యక్షులు కట్టం యర్రప్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, రావు గంగాధర్ రావు, మందలపల్లి సర్పంచ్ గుజ్జుల శ్రీనివాసరావు, బొల్లికొండ నాగేశ్వరరావు, చిన్నశెట్టి సత్యనారాయణ, చిన్నశెట్టి యుగంధర్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## భద్రాద్రి కాంగ్రెస్ ఎస్సీ సెల్‌కు కొత్త సారథి

- **జిల్లా అధ్యక్షుడిగా గద్దల రమేష్ నియామకం**
- **ఢిల్లీలో నియామక పత్రం అందజేత**



**కొత్తగూడెం, మే 26 ( ప్రజాజ్యోతి )** కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గద్దల రమేష్ నియామక పత్రాన్ని మంగళవారం ఢిల్లీలో అందుకున్నారు. ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐసీసీ ఎస్సీ విభాగం జాతీయ అధ్యక్షుడు రాజేంద్ర పాల్, ఏఐసీసీ జాతీయ సమన్వయకర్త, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి గారి ప్రీతం, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తానని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో పర్యటించి పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజారిటీతో విజయం సాధించేలా కృషి చేస్తానని తెలిపారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు సముచిత గుర్తింపు, అవకాశాలు కల్పించేందుకు కట్టుబడి ఉంటానన్నారు. జిల్లాలో ఎస్సీ సెల్‌కు పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తానని గద్దల రమేష్ స్పష్టం చేశారు.

## మహిళ అదృశ్యం.. కేసు నమోదు




**టేకులపల్లి,మే26,ప్రజాజ్యోతి:** మహిళ అదృశ్యమైన సంఘటన టేకులపల్లి లోని మంగళవారం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలు చింతలంక గ్రామం చెందిన బొల్లి నాగరాజు తో 7 సంవత్సరాల క్రితం రాగబోయినగూడెం ఈసం బయమ్మ కూతురి శిరీష తో వివాహ జరిగింది.పెళ్లి అయి 7 సంవత్సరాల పిల్లలు పుట్టడం లేదు అని శిరీష ను మానసికంగా,శారీకంగా ఇబ్బంది పెట్టడంతో తట్టుకోలేక మే 24 ఆదివారం రాత్రి 9 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవడంతో చుట్టూ పక్కల ఇంట్లో వెతికి ఆచూకీ లేకపోతే తల్లి అయిన ఈసం బయమ్మ టేకులపల్లి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు మేరకు ఎస్సై అలకుంట రాజేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పంట అవశేషాలను కాల్చవద్దు – భూమిలో కలపండి

♦ రైతులకు మండల వ్యవసాయ అధికారి సూచనలు



**దమ్మపేట,మే 26,(ప్రజా జ్యోతి):** దమ్మపేట మండలంలో యాసంగి 2026 సీజన్‌లో మండల పరిధిలో సుమారు 9 వేల ఎకరాల్లో వరి పంట, 5 వేల ఎకరాల్లో మొక్క జొన్న పంట సాగు చేసినట్లు దమ్మపేట మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం వరి, మొక్క జొన్న పంటల కోతలు పూర్తయ్యాయని, పంట కోత అనంతరం రైతులు వరి కయ్యలు, మొక్కజొన్న దంట్లు, ఆకులు, ఫ్రెండ్ కొట్లు వంటి పంట అవశేషాలను పొలాల్లోనే వదిలేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో పాటు విద్యుత్ తీగల రాపిడి వల్ల నిప్పురవ్వలు పడి పంట అవశేషాలు తగలబడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. దీంతో భూసారం తగ్గిపోవడమే కాకుండా పర్యావరణ కాలుష్యం కూడా పెరుగుతోందన్నారు. ముఖ్యంగా పామాయిల్ తోటల్లో అంతర పంట గా మొక్క జొన్న సాగు చేస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.పంట కోత పూర్తయిన వెంటనే పంట అవశేషాలను రోటవేటర్ ద్వారా భూమిలో కలపాలని సూచించారు. ఇలా చేయడం వల్ల భూమి సారవంతం కావడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని తెలిపారు. రైతు సోదరులందరూ పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలిపి భూసారాన్ని కాపాడాలని మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## భద్రాద్రి రామయ్య భూముల్లో ఆక్రమణలు తొలగించండి

• రాష్ట్ర దేవాదాయ శాఖ కమీషనర్ హనుమంతరావు

**భద్రాచలం టౌన్ , మే 26 ప్రజాజ్యోతి** ఏపీలోని పురుషోత్తపట్నం గ్రామంలో ఉన్న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంకు చెందిన భూముల్లో ఇటీవల కాలంలో చోటు చేసుకున్న ఆక్రమణలను తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అధికారులను దేవాదాయ శాఖ కమీషనర్ హనుమంతరావు ఆదేశించారు. ఇటీవల కాలంలో రామాలయ భూముల్లో ఆక్రమణలు ఎక్కువగా చోటు చేసుకోవడంతో పాటు దేవస్థానం అధికారులు ప్రేక్షక పాత్ర వహించడంతోనే ఆలయ భూముల ఆక్రమణలు పెరిగిపోతున్నాయన విమర్శలు వచ్చాయి. ఆక్రమణలకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో సైతం ప్రచారం కావడం, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదులు వెళ్లడంతో కమీషనర్ స్పందించారు. ఆలయ భూముల్లో ఆక్రమణలు తొలగించాలని అందుకు సంబంధించిన చేపట్టిన చర్యల గురించి ఆరా తీశారు. దీంతో మంగళవారం భద్రాచలం దేవస్థానం అధికారులు రామాలయ భూముల్లో చోటు చేసుకున్న ఆక్రమణలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు ఆక్రమణదారులను ఇళ్లను ఖాళీ చేసి వెళ్లాలని, లేదంటే త్వరలోనే తామే తొలగిస్తామని దేవస్థానం అధికారులు వారితో పేర్కొన్నారు. సుమారు 35 నుంచి 45 ఇళ్ల వరకు తొలగించాల్సి ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఇవన్నీ గడిచిన ఏడాది కాలంలోనే వెలిసినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం.

# గ్రామ దీపికల సమ్మెకు బీజేపీ మద్దతు

♦ హామీలు నిలబెట్టుకోవాలి.. లేకపోతే ఉద్యమం తీవ్రం : తంబళ్ల రవి



**దమ్మపేట,మే 26,(ప్రజాజ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట తమ సమస్యల పరిష్కారం కోసం గ్రామదీపికలు (వి.ఏ.ఓ) చేపట్టిన నిరవధిక సమ్మెకు అశ్వారావుపేట నియోజకవర్గ బీజేపీ నాయకులు తంబళ్ల రవి బీజేపీ పార్టీ తరఫున మద్దతు తెలిపారు. సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఆయన వి.ఏ.ఓ సమస్యలను తెలుసుకుని వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా తంబళ్ల రవి మాట్లాడుతూ, కొన్నిరోజులుగా వి.ఏ.ఓ లు తమ సమస్యల పరిష్కారం కోసం నిరసనలు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు స్పందించక పోవడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా విస్మరించిందని విమర్శించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలించిన విధంగానే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా పాలన సాగిస్తే గత ప్రభుత్వానికి ఎదురైన పరిస్థితులే కాంగ్రెస్‌కూ ఎదురవుతాయని హెచ్చరించారు. రెండేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందని అన్నారు. వి.ఏ.ఓ లతో విపరీతమైన పనులు చేయించుకుంటూ, వారి సమస్యలను పట్టించుకోకుండా చిన్నచూపు చూడ డం సరికాదన్నారు. వెంటనే వి.ఏ.ఓ ల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, లేకపోతే వి.ఏ.ఓ లతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పల్లపు వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు ఉడతనేని విశ్వేశ్వరరావు, గూడా ముత్యాలరావు, దొడ్డ సతీష్, కారం రత్నకుమారి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ, అరటి పండ్లు పంపిణీ

• ఉపాధి కూలీలకు రూ.500 వేతనం ఇవ్వాలి
• మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు





**ములకలపల్లి, మే 26 ప్రజాజ్యోతి:** మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు సోమవారం బూర్గంపహాడ్–అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు మజ్జిగ ప్యాకెట్లు, అరటిపండ్లు పంపిణీ చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కూలీలకు ఉపశమనం కలిగించేందుకు స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడిన ఆయన పనుల తీరు, వేతనాలు, పని దినాలపై ఆరా తీశారు. అలాగే గ్రామ సమస్యలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "ఎండాకాలంలో ఉపాధి కూలీలు పడుతున్న కష్టం బాధాకరం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేశాం. కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీలు, హామీల పేరుతో ప్రజలను మోసం చేసింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో చాలా వరకు అమలు కాలేదు" అని విమర్శించారు. ప్రస్తుతం ఇస్తున్న కూలీ సరిపోవడం లేదని, ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.500 వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కల్లూరు కిషోర్, మాజీ సర్పంచ్ బైటి రాజేష్, పోతుగంటి లక్ష్మణ్, తాటి ప్రవీణ్, ఆదిమూలం యాదగిరి, కందుకూరి సత్యనారాయణ, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు

## కిశోర బాలికలకు హెచ్పీవీ వ్యాక్సిన్ పై అవగాహన



**టేకులపల్లి,మే26,ప్రజాజ్యోతి:** టేకులపల్లి సెక్టార్ లో 99 రోజుల ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక భాగంలో టేకులపల్లి గ్రామ పంచాయతీ ఏ డబ్ల్యుసి టేకులపల్లి 2, సెంటర్ పరిధి లో సిడిపిఓ కేఎం.తార, సెక్టార్ సూపర్ వైజర్ కె.అనురాధ ఆధ్వర్యంలో మంగళవారం కార్యక్రమని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కిషోర బాలికలకు బాల్య వివాహలు,అక్రమ రవాణా,పోషక విలువలు ఉన్న కూరగాయలు ఆకుకూరలు పండ్లు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషణ విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి అని అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గ్రామ సర్పంచ్ బోడ బాలు నాయక్,వార్డ్ సభ్యులు ఉషలు పాల్గొన్ని వారు మాట్లాడుతు హెల్త్ ఆర్ బి ఎస్కే టీమ్ వాళ్ళు, గోపీలాల్,కిషోర బాలికలకు హెచ్పివి వ్యాక్సిన్ గర్భాశయ క్యాన్సర్ గురించి అలాగే రక్తహీనత గురించి వివరించారు.ఈ కార్యక్రమం లో కిషోర బాలికల ఆశ పద్మ, అంగన్వాడీ టీచర్స్ భద్రమ్మ, ఇందిరమ్మ,పద్మ తదితరులు పాలొగొన్నారు.

## పంట పొలాల్లో మంటలు పెట్టొద్దు

♦ భూసారాన్ని రక్షించుకుందాం



**టేకులపల్లి,మే26,ప్రజాజ్యోతి:** పంట పొలాల్లో మంటలు పెట్టొద్దు రైతులను ఇల్లందు సహాయ వ్యవసాయ సంచాలకులు జి.లాల్చంద్ కోరారు. మంగళవారం ముత్యాలంపాడు క్రాస్ రోడ్ లోని రైతువేదికలో రైతులను ఉద్దేశించి పంట అవశేషాలను తగలబెట్టకుండా భూమిలో కలియదున్నలని ఇల్లందు సహాయ వ్యవసాయ సంచాలకులు జి.లాల్ చాంద్ రైతులకు వివరించారు. పంట అవశేషాలను భూమిలో కలియదున్నడం వల్ల భూసారాన్ని రక్షించుకోవచ్చు అని అన్నారు. మంట పెట్టడం వల్ల భూమిలోని సూక్ష్మజీవులు,పంటకు ఉపయోగపడే అనేకమైన సూక్ష్మజీవులు చనిపోవడం వల్ల రైతులకు నష్టం జరుగుతుంది.ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి ఎన్.అన్నపూర్ణ, ఏఈఓ లు శ్రావణి, విశాల రైతులు పాల్గొన్నారు.

# భక్తి పారవశ్యంలో సమ్మక్క–సారలమ్మ ప్రతిష్ఠ మహోత్సవాలు

- మూడు రోజుల పాటు వైభవంగా ఆధ్యాత్మిక వేడుకలు.
- ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదానానికి ఏర్పాట్లు పూర్తి



**పాల్వంచ, మే 26, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండలంలోని పుల్లయ్య గూడెం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ సమ్మక్క–సారలమ్మ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధల నడుమ ప్రత్యేక పూజలు, హోమాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మహోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ముస్తాబు చేయడంతో గ్రామమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మే 27న ఉదయం మంగళవాయిద్యాల నడుమ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొలి రోజు గౌరీదేవతల పూజలు, బోనాల సమర్పణ, సమ్మక్క–సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి భక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. మే 28న హోమాలు, ప్రత్యేక అభిషేకాలు, ఓడి బియ్యం కార్యక్రమం, అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు. అమ్మవారికి ప్రత్యేక కళ్యాణం నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రానున్నారు. మొక్కులు తీర్చుకునే భక్తుల కోసం ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మహోత్సవాల చివరి రోజు మే 29న గంగ స్నానం, ప్రత్యేక నైవేద్యాలు, తీర్థప్రసాదాల పంపిణీతో పాటు ముగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు. మహోత్సవాల విజయవంతానికి గ్రామ పెద్దలు, యువత, మహిళలు, భక్తులు అందరూ సహకరించాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

# మానవసేవే మాధవ సేవ అంటూ ముందుకు సాగుతున్న జనహిత ఫౌండేషన్






- గిరిజన కుటుంబాలకు పౌష్టికాహారం, నిత్యావసర సరుకుల పంపిణీ

**పాల్వంచ, మే 26, ప్రజాజ్యోతి:** మానవసేవే మాధవ సేవ అనే నినాదంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న జనహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాల్వంచ మండల పరిధిలోని సారేకల్లు గిరిజన ప్రాంతంలో పేద కుటుంబాలకు పౌష్టికాహారం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. జనహిత ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు బేరా శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పది కుటుంబాలకు అవసరమైన సరుకులను అందజేశారు. గత మూడు సంవత్సరాలుగా మారుమూల ప్రాంతాల్లో ఉన్న గ్రామాలను గుర్తించి, అక్కడి నిరుపేదలకు చలికాలంలో దుప్పట్లు, ఎండాకాలంలో పౌష్టికాహారం అందిస్తూ తమ వంతు సహాయం చేస్తున్నారు. అలాగే అవసరమైన చోట ఆరోగ్య ఖర్చుల నిమిత్తం కూడా గ్రామాల్లోకి వెళ్లి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బేరా శ్రీలక్ష్మి, నాజియా, లావణ్య, మల్లేష్, సారేకల్ల గ్రామ వార్డు సభ్యుడు అజయ్ పాల్గొన్నారు.

# అన్నపురెడ్డిపల్లి బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

- పేద, గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యకు ఉత్తమ వేదిక
- క్రమశిక్షణ, ఆధునిక సౌకర్యాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ప్రత్యేక గుర్తింపు
- వసతి, భోజనం, ప్రయోగశాలలతో సమగ్ర విద్యా వాతావరణం
- ఈ విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు కళాశాల యాజమాన్యం ఆహ్వానం



**అన్నపురెడ్డిపల్లి, మే 26, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లిలోని బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరానికి ప్రవేశాలు కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందించడమే లక్ష్యంగా కళాశాల పనిచేస్తోంది. విద్యతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యత పెంపొందించే విధంగా ప్రత్యేక విద్యా వాతావరణాన్ని కళాశాలలో కల్పిస్తున్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తూ భవిష్యత్‌లో ఉన్నత స్థానాలు అధిరోహించేలా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. కళాశాల లో ఉన్నత అర్హతలు కలిగిన అధ్యాపక బృందం ద్వారా తెలుగు, ఆంగ్లం, గణితం, వాణిజ్యం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, వృక్షశాస్త్రం, జంతు శాస్త్రం, కంప్యూటర్ శాస్త్రం తదితర విభాగాల్లో నాణ్యమైన విద్య బోధిస్తున్నారు. చదువుతో పాటు సహపాఠ్య, క్రీడా కార్యక్రమాలకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు.

అన్నపురెడ్డిపల్లి బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న ముఖ్య వసతులు:

★ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం మరియు రాత్రి పోషకాహార భోజన సౌకర్యం

★ బాలురకు ప్రత్యేక వసతి గృహాలు, నిరంతర పర్యవేక్షణ

★ శుద్ధి చేసిన తాగునీటి సౌకర్యం

★ ఆధునిక కంప్యూటర్ ప్రయోగశాలలు

★ సైన్స్ ప్రయోగశాలలు, ప్రాయోగిక బోధనకు అవసరమైన పరికరాలు

★ విశాలమైన గ్రంథాలయం, అధ్యయనానికి అనుకూల వాతావరణం

★ విశాలమైన ఆటస్థలం, క్రీడా సామగ్రి సౌకర్యం

★ పరిశుభ్రమైన మరుగుదొడ్లు, ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ

★ విశాలమైన తరగతి గదులు, ప్రశాంత విద్యా వాతావరణం

★ ప్రతి విద్యార్థిపై ప్రత్యేక పర్యవేక్షణ, మార్గదర్శక బోధన

★ సహపాఠ్య, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలకు ప్రోత్సాహం

★ క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యా విధానం

ఈ సౌకర్యాల ద్వారా పేద, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన డిగ్రీ విద్యను అభ్యసించే అవకాశం పొందుతున్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, సంస్కారం, నాయకత్వ లక్షణాలు పెంపొందేలా కళాశాల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌కే బురాన్ ఆధ్వర్యంలో క్రమశిక్షణ, నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ అధ్యాపకుల ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్య అందించేందుకు ప్రత్యేక విద్యా వాతావరణం కల్పిస్తున్నట్లు కళాశాల వర్గాలు తెలిపాయి. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని యాజమాన్యం కోరింది. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన నంబర్లు: 9059490623, 9392540836, 8500006021, 9951734877, 9553131588.



# ప్రజాసేవలో బీజేపీ నాయకులు

- తంబళ్ల రవి ఆధ్వర్యంలో 400 మందికి మజ్జిగ పంపిణీ



**దమ్మపేట, మే 26, (ప్రజాజ్యోతి):** దమ్మపేట లో బీజేపీ నాయకులు తంబళ్ల రవి ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. దమ్మపేట మెయిన్ రోడ్డులోని పాత ఎంఆర్వో కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వేసవి కాలంలో మజ్జిగ తాగడం వల్ల శరీరానికి చల్లదనం కలిగి, వేడి నుంచి కొంత ఉపశమనం లభిస్తుందని తెలిపారు. సుమారు 400 మందికి మజ్జిగ పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తంబళ్ల రవి, గూడా ముత్యాల రావు, దొడ్డ సతీష్, కారం రత్నకుమారి, ఆళ్ల సుజాత, ఇందు తదితరులు పాల్గొన్నారు.

# యువతి అదృశ్యం.. కేసు నమోదు



**ములకలపల్లి, మే 26, ప్రజాజ్యోతి:** మండలంలోని నల్లివారి గూడెం గ్రామానికి చెందిన ఎస్‌కే నిషాన్ (19) అదృశ్యమైన ఘటనపై ములకలపల్లి పోలీస్ స్టేషన్ లో సోమవారం కేసు నమోదు అయ్యింది. స్థానిక ఎస్సై మధుప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 22వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులంతా భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. అనంతరం రాత్రి 11 గంటల సమయంలో ఆమె తల్లి ఎస్‌కే నిషాద్ బీ లేచి చూడగా నిషాన్ ఇంట్లో కనిపించలేదు. బంధువులు, పరిచయస్తుల వద్ద వెతికినా ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో యువతి తల్లి నిషాద్ బి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిషాద్ బి ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై మధుప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# దమ్మపేట మండలంలో వేర్వేరు ఘటనల్లో ఇరువురి మృతి

- కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**దమ్మపేట, మే 26, (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలోని మందలపల్లి గ్రామానికి చెందిన లోచర్ల పాపమ్మ చాకలి వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. మంగళవారం ఉదయం రోజువారీ మాదిరిగానే బట్టలు ఉతకడానికి వెళ్లిన ఆమె, కొంతసేపటి తర్వాత ఆయాసంగా ఉందని చెప్పి కుర్చీలో కూర్చుంది. అనంతరం కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ఆమె మృతిచెంది ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై ఆమె కుమారుడు లోచర్ల రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అలాగే దమ్మపేట మండలంలోని లచ్చాపురం గ్రామానికి చెందిన తోట రాము కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన రామును తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన అతడు గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. అనంతరం చికిత్స నిమిత్తం పాలవంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై తోట లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.